# సారేజహాఁసే అచ్ఛా

## ఉత్తరం

### పి.లక్ష్మారెడ్డి

ఆకాశం మేఘావృతమై దట్టంగా వుంది. వర్షం వస్తుందేమో! సాయంత్రం ఆరున్నరయింది. ఇది వరకే రావల్సిన గోల్కొండ డౌన్ ఇంకా రాలేదు. ప్లాట్‌ఫాం రద్దీగా, చుట్ట పొగలతో వర్షం రాబోతున్న వాతావరణంలో సైతం ఉక్కగా వుంది.

వారం రోజుల క్రితంజరిపిన ప్రయాణపు టాలోచనలతో గుండె బరువెక్కింది. ఓ మనిషి ప్రాణం పోవడం—పది మందిలో వెలితిని సృష్టిస్తుంది.

భీకరమయిన కూతతో ట్రెయిన్ రావడం మూలాన ఆలోచనలకు అంతరాయం కలిగింది. వెనుక పెట్టెలు ఖాళీగా వుంటాయి. అందులోకి చేరిపోయాను. ట్రెయిన్ కదిలింది. అయిదు నిమిషాల్లో వర్షమూ మొదలయింది. విండో గ్లాస్ షట్టర్ దించాను. కిటికీ అద్దం మీద వర్షపు నీటి చారలు. ధారాపాతంగా కారుతున్న ఆ నీటి చారలలో... మసక దృశ్యం... ఎడతెగని కన్నీటి ధారలతో వీడ్కోలు చెప్పిన మా బావగారు...

పది రోజుల క్రితం ఓ కార్డొచ్చింది. తిప్పి చూస్తే- పెద్ద కర్మ. అదీ నిన్ననే అయ్యింది. మా శ్రీమతి గారి పెత్తండ్రి మరణం. ఇది మేము వూహించనిది. వర్షాకాలం మొదట్లో కాలేజీలు తెరవగానే, మేము వచ్చేటప్పుడు ఆయన ఆరోగ్యం గానే వున్నారు. ఇంతలోనే ఏమయ్యిందో?! ఇంటికి అయిదొందల కిలోమీటర్ల దూరంలో ఉద్యోగంలో వున్నాము. అయిన వాళ్ళు మరణించినా, చావుకి కాదు గదా కర్మకూ అందుకోలేని దుస్థితి.

శ్రీమతికి పరిస్థితిని మెల్లగా, ఆమె షాక్ తినకుండా వుండేలా వివరించాను. పిల్లలు బడి నుంచి రాగానే, వెంటనే కృష్ణకు ప్రయాణమయ్యాము. కేంద్ర ప్రభుత్వం విధించిన డీసెల్ కోతతో ఆర్టీసీ బస్సుల రద్దు. హన్మకొండలో అయిదు గంటల నిరీక్షణ అనంతరం బస్సు దొరికింది. తెల్లారేసరికి ఇంటికి చేరాము. పరామర్శలు జరిగాయి.

పిల్లలకు పరీక్షలు. అందుకే అంత దూరమెళ్ళినా, తెల్లారే తిరుగు ప్రయాణం కట్టాము. మేము వచ్చేటప్పుడు మా బావగారు... డాక్టరు... ఆయన దుఃఖం కట్టలు త్రెంచుకుంది. అన్నీ తెల్సిన మనిషి ఆయన కెవరు చెప్పగలరు? నా మనసంతా అదోలా అయిపోయింది. "మా అన్నయ్య అలా ఏడుస్తూంటే రాబుద్ధేయలేదండీ. మనం ఇంకా ఉండాల్సింది." అని శ్రీమతి బాధ పడింది. నా మనసు పన్నెండేళ్ళు వెనక్కి వెళ్ళింది.

మా తండ్రిగారు అకస్మాత్తుగా మరణించారు. ఆ రోజులు మళ్ళీ గుర్తొచ్చాయి.

మా బావగారూ హృదయమున్న మనిషే. అందుకే తండ్రిగారి వియోగ బాధ మర్చి పోలేక పోతున్నారు. ఘంటసాల గారి భగవద్గీత నాలో క్రమంగా ధైర్యాన్ని నూరిపోసింది. కాగితమూ కలమూ తీసికున్నాను...

ప్రియమైన బావగారికి నమఃసుమాలతో—

మీరు వూహించని ఉత్తరం కదూ! ఎందుకో వ్రాయాలనిపించింది.

భార్యా-భర్తల మధ్యగాని, తండ్రీ పిల్లల మధ్యగాని, సోదరీ-సోదరుల మధ్య గానీయండి, ఉండే అనుబంధాలు రెండు రకాలు. ఒకటి యాంత్రికం-సమాజం నిర్దేశించిన చట్రంలో నడుస్తుంది. రెండవది మానసికం— గుండె లోతుల్లోంచి స్పృశించే, విడదీయరాని పవిత్రమైన అనుబంధం, రెండో కోవలో అనుబంధాలూ, ఆత్మీయతలూ పెంచు కునే వ్యక్తులకు, అవతలి వ్యక్తి శాశ్వతంగా దూర మైనప్పుడు మనసు పడే బాధ, అవ్యక్తం. భార్యా పిల్లల్తో అనుబంధం పెనవేసుకపోయినా, తల్లి దండ్రుల ఎడబాటు పూరించలేనిదే. మనుషులు మన మధ్య వున్నప్పుడు... మనం మర్చిపోయిన... కాల గర్భంలో కల్సిపోయిన, చిన్ననాటి జ్ఞాపకాలు... వారు దూరమయినప్పుడు ఉవ్వెత్తున పైకి లేస్తాయి. ముఖ్యంగా అమ్మకి, నాన్నకి సంబంధించినవి మరువలేని స్మృతులే! బడికి పంపడంతో మొదలయ్యే జ్ఞాపకాల పరంపర-చదువు నేర్పడం, నేర్పించడం, లోకాన్ని నేర్పడం, ఇరుగు పొరుగును తమదైన శైలిలో పరిచయం చేస్తూ, కొందరి గురించి హెచ్చరించడం, పెళ్ళి, జీవితంలో స్థిరత్వం కల్పించడం కోసం ఆరాటం... ఇంకా ఎన్నో... మరెన్నెన్నో..., ఆయా సందర్భాలలో వాళ్ళు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పయినా, ఒప్పయినా... నేడు అవి తీపిజ్ఞాపకాలుగా బాధించక మానవు. ఇందుకు ఉపశమనం-కాలమే! ఎంతటి తీవ్రమయిన గాయాన్నయినా మాన్పించే శక్తి కాలానికి వుంది. మీకు తెలియదని కాదుగానీ, మనసు కలత జెందినప్పుడు, అమరగాయకుడు ఘంటసాల గానం చేసిన భగవద్గీత నిశ్శబ్ద, నిశీథిలో వింటే, మనసు సేద దీరి వాన వెలిసినట్లవుతుంది.

-ఇక చివరగా ఒక్కమాటగా స్వగ్రామంతో అనుబంధం తెగిపోయినట్లేనన్నారు. అది సరికాదు. ఇల్లు, తండ్రి జ్ఞాపకార్థం అలాగే ఉంచుతానని మీరే అన్నారు. అదినరికాదు. క్రితం లాగే ప్రతి విజయదశమికీ, మీరుఎక్కడున్నా సొంత వూరుకు వెళ్ళొచ్చు. ఇంత దాకా మీరు ఆచరించిన నియమాన్ని ఆపేయాల్సిన అవసరం లేదు! అక్కడెవరున్నారు! అని ఎందుకనుకుంటారు? మీ స్నేహితులూ, మిగతా బంధువర్గమూ లేరూ? మాతృభూమికి సంబంధించిన ప్రతి మట్టి అణువూ-ఏ మనిషికైనా కడదాకా తోడుండే నేస్తం... జననీ, జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి...

తండ్రి ఎడబాటు కల్గించిన దుఃఖం నుంచి మీరు త్వరగా కోలుకోవాలని, మీరు ఎల్లప్పుడు నవ్వుతూ వుండాలని సదా ఆకాంక్షించే

—మీ ప్రియ ఆత్మీయుడు-

(పి.ఎల్.ఆర్.)

సంతకం చేసి, ఉత్తరం పోస్టు చేశాక మనసు తేలికపడింది.



## గులాబీలు

ఎర్ర గులాబీల
అసలు రంగు తెలుపు!
కానీ-
నీ సౌందర్యం చూసిన తర్వాతే
అవి సిగ్గుపడి ఎర్ర బడ్డాయి!

తెల్ల గులాబీల
అసలు రంగు ఎరుపు!
కానీ-
నీ లావణ్యం చూసిన తర్వాతే
అవి తెల్లబోయాయి!

— 'రఘువర్మ'